దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం! గమనం!!

సంపుటి: 3 | సంచిక : 234 | ఆదివారం 30. 8. 2026 | ఎడిటర్ వేముల అయోధ్య రాములు | పేజీలు 4 | వెల: 5.00

## దివ్యాంగులపై దయ లేని ప్రభుత్వం కూడా ఒక ప్రభుత్వమేనా?

**తొలి సమయం హైదరాబాద్**



దివ్యాంగులపై దయ లేని ప్రభుత్వం కూడా ఒక ప్రభుత్వమేనా? అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు నిలదీశారు. ఎల్‌బినగర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహ రిస్తున్న తీరును ఎండగట్టారు. బీఆర్ఎస్ హయాంలో దివ్యాంగుల పెన్షన్ ను రూ.500 నుంచి రూ.4016కు పెంచిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. అలాగే హౌసింగ్ లో దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్ ఇచ్చారని, విద్య, ఉద్యోగాల్లో 4 శాతం రిజర్వేషన్ ఇచ్చింది కేసీఆర్ ప్రభుత్వమని గుర్తుచేశారు. కానీ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక.. సీఎం రేవంత్ దివ్యాంగుల పెన్షన్ ను ఒక్కరూపాయి అయినా పెంచాడా? అని ప్రశ్నించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా.. తెలంగాణలో దివ్యాంగుల చట్టాన్ని అద్భుతంగా అమలు చేసి.. భారత్‌లోనే ఉత్తమ రాష్ట్రంగా అవార్డు పొందేలా చేసింది కేసీఆర్ అని కితాబిచ్చారు. దివ్యాంగుల సమస్యలపై అసెంబ్లీలో బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వాన్ని నిలదీస్తుందని హరీష్ రావు హామీ ఇచ్చారు. అలాగే దివ్యాంగులు కోరిన విధంగా కేసీఆర్ తో సంప్రదించి.. బీఆర్ఎస్ పార్టీలో దివ్యాంగుల శాఖను కూడా ఏర్పాటు చేసి.. దివ్యాంగులను పార్టీలో భాగస్వామ్యం చేసుకుంటామన్నారు.

## ల్యాండింగ్‌లో పేలిన టైర్

- త్రుటిలో తప్పిన ముప్పు
- ఢిల్లీ-బిలాస్‌పూర్ అలయన్స్ విమానంలో ఘటన
- 37 మంది ప్రయాణికులు సహా 41 మంది సురక్షితం




## సోనియా ఆత్మకథపై 'ప్రచురణ' రగడ

- 'బిలాంగింగ్'కు తాము ప్రచురణకర్తలం కాదన్న పెంగ్విన్ ఇండియా
- మోదీ, ఆర్ఎస్ఎస్, భారత్-చైనా అంశాల్లో మార్పులు కోరారంటూ కాంగ్రెస్ ఆరోపణ
- సంపాదకీయ మార్పుల వివాదంపై ప్రచురణ సంస్థ వివరణ




## నేపాల్ వరదల్లో 1,400 మందికి పైగా గల్లంతు



- గల్లంతైన వారి జాబితాను విడుదల చేసిన నేపాల్ పోలీసులు
- 178 మంది భారతీయులు సహా 644 మంది వివరాల వెల్లడి
- సుమారు 320 మంది భారతీయుల ఆచూకీ లేదన్న విదేశాంగ శాఖ


# సర్‌పై అభ్యంతరాలు.. గడువు పొడిగించాలి

## తెలంగాణ ముఖ్యమంత్రి రెవంత్ రెడ్డి

- కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌కు సీఎం లేఖ
- అక్టోబర్ 19తో గడువు ముగుస్తున్నందున మరో 4 వారాలు పెంచాలి
- సమీప భవిష్యత్తులో ఎలాంటి ఎన్నికలు లేనందున గడువు పెంచాలి
- 'సర్'కు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తోంది
- ఓటర్ల పరిశీలనలో అనేక లోపాలు ఉన్నాయని, నోటీసు ఇవ్వకుండా ఓట్లు తొలగించవద్దు
- గ్రామ, వార్డు సభల్లో ముసాయిదా ఓటర్ జాబితాను కనీసం రెండుసార్లు చదివి వినిపించాలి
- నోటీసులకు సమాధానం ఇచ్చేందుకు 4 వారాల గడువు ఇవ్వాలి
- పట్టణాల్లో పోలింగ్ కేంద్రాల వారీగా హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలి
- మండలస్థాయి అధికారులు ఇచ్చే డాక్యుమెంట్‌నూ ఆమోదించాలి



# ఆదివాసీ వేల్పుల రక్షణ మన అస్తిత్వ రక్షణ



రాయి బండాని వంశానికి, సమ్మక్క తల్లి తమ్ముడు చుంచు వారి ఇంటి వేల్పుగా భావించే

పాఖాల కొత్తగూడ--మడుగూడెంలోని శ్రీ బాల కుమారస్వామి సన్నిధిలో గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి, క్షుద్ర పూజలు నిర్వహించి, మన దేవునికి సంబంధించిన అత్యంత పురాతన వస్తువులను దోచుకెళ్లిన ఘటన అత్యంత ఆందోళనకరం.

మన పూర్వీకుల కాలం నాటి పవిత్ర వస్తువులను దోచుకెళ్లడం అత్యంత తీవ్రమైన ఘటన. ఆ వస్తువులు మనకు కేవలం లోహాలు, పాత వస్తువులు కాదు. అవి మన పూర్వీకుల జ్ఞాపకాలు, మన సంప్రదాయాల ఆనవాళ్లు, మన వేల్పు వ్యవస్థకు ప్రతీకలు, మన ఆదివాసీ అస్తిత్వానికి సజీవ ఆధారాలు.

నేడు ఒక వేల్పు సన్నిధిలోని పురాతన వస్తువులు దోపిడీకి గురైతే, రేపు మరో వేల్పు సన్నిధి కూడా అదే ప్రమాదాన్ని ఎదుర్కొనే అవకాశం ఉంది. సరైన రక్షణ వ్యవస్థ లేకపోతే మన పూర్వీకుల నుంచి తరతరాలకు వస్తున్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వం ఒక్కొక్కటిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉంది.

అందువల్ల ప్రభుత్వం ఈ ఘటనను సాధారణ కేసుగా కాకుండా ఆదివాసీ సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు సంబంధించిన ప్రత్యేక అంశంగా పరిగణించాలి.

మన వేల్పులు సాధారణంగా ఊరికి దూరంగా అడవుల్లో, కొండల్లో, చెట్ల మధ్య ప్రకృతితో మమేకమై ఉంటాయి; వాటికి గోడలు, తాళాలు, కాపలాదారులు ఉండవు, ఎందుకంటే ఆదివాసీ విశ్వాసంలో ఆదిశక్తి రూపమైన వేల్పే తనను తాను కాపాడుకుంటుంది, ప్రకృతే దాని రక్షణ కవచం అనే భావన తరతరాలుగా కొనసాగుతోంది.

అడవుల్లోకి అక్రమ ప్రవేశాలు, పురాతన వస్తువులపై ఆసక్తి, ఆక్రమణలు, ప్రకృతి వనరుల దోపిడీ, సంప్రదాయ సామాజిక నియంత్రణ బలహీనపడటం వంటి కారణాలతో ఈ పవిత్ర స్థలాలు కొత్త ప్రమాదాలను ఎదుర్కొంటున్నాయి. కాబట్టి "మన వేల్పును దేవతే కాపాడుతుంది" అనే మన విశ్వాసాన్ని గౌరవిస్తూనే, "మన వేల్పు మరియు దాని పరిసరాలను మనం కూడా బాధ్యతగా కాపాడాలి" అనే కొత్త సామూహిక రక్షణ విధానాన్ని రూపొందించాల్సిన అవసరం ఉంది.

మన పూర్వీకుల అస్తిత్వాన్ని, మన సంస్కృతిని, మన భవిష్యత్ తరాల హక్కును కాపాడుకుందాం.

**చుంచు రామకృష్ణ ణజు**
**కోయ పున్నెం ధర్మ ప్రచారక్**

# ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలి

## సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ

**తొలి సమయం హైదరాబాద్**


తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు (కేకే) నేతృత్వంలోని కమిటీ ప్రతినిధి బృందం శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డిని కలిసి ఉద్యమకారుల గుర్తింపు, సంక్షేమానికి సంబంధించిన అంశాలపై చర్చించింది. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు మోతె శోభన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్ పాల్గొన్నారు. ఇటీవల హైదరాబాద్‌లోని అమరవీరుల స్మారక చిహ్నం (అమరదీపం) వేదికగా నిర్వహించిన విస్తృత



స్థాయి సంప్రదింపుల వివరాలను కమిటీ ముఖ్యమంత్రికి వివరించింది. ఈ సంప్రదింపుల్లో 13 వేల మందికి పైగా తెలంగాణ ఉద్యమకారులతో పాటు వివిధ జేఏసీలు, ప్రజాసంఘాలు, కవులు, కళాకారులు, మహిళా ఉద్యమకారులు పాల్గొన్నట్లు కమిటీ తెలిపింది. ఉద్యమకారుల నుంచి సేకరించిన అభిప్రాయాలు, విజ్ఞప్తులతో పాటు ఉద్యమకారుల వర్గీకరణకు సంబంధించిన ముసాయిదా నివేదికను ముఖ్యమంత్రికి సమర్పించింది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమకారులు చేసిన త్యాగాలను గుర్తిస్తూ వారి సేవలకు తగిన గౌరవం కల్పించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నట్లు కమిటీ వెల్లడించింది. ఉద్యమకారుల గుర్తింపు, సంక్షేమానికి సంబంధించిన కసరతును ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని సీఎం సూచించారు. ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియ కోసం అధికారిక వెబ్‌సైట్, పోర్టల్ ఏర్పాటు, డిజిటల్ దరఖాస్తుల స్వీకరణ, జిల్లాల వారీగా సమన్వయం, అవసరమైన పరిపాలనా వనరుల కల్పన వంటి అంశాల్లో కమిటీకి పూర్తి సహకారం అందించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

## రాయదుర్గం భూమి బంగారు గని

**269 కోట్లకు ఎకరా పలికిన ధర**





## అమెరికాలో తెలుగు యువతి హత్య

- ఆగ్రాలో నిందితుడి పట్టివేత
- అమెరికాకు అప్పగించనున్న పోలీసులు

2

## ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చాం..

- నూతనకల్, మద్దిరాల రైతుల కళ్ళల్లో ఆనందం చూశాము.
- న్యాయబద్ధంగా కొన్న భూమి ..సీలింగ్ యాక్ట్ లోబడి సమస్యగా ఏర్పడి పట్టా కాకుండా పోయింది..
- ప్రత్యేక రాష్ట్రం వచ్చాక కూడ ఆ భూ సమస్యను చెప్పుకోవడానికి పోతే వినే నాధుడు లేడు..
- భూమి ఉన్నప్పటికీ కొడుకు చదువు కోసమో, బిడ్డ పెండ్లి కోసమో, ఆరోగ్య అవసరాలకోసమో అమ్ముకునే అవకాశం లేనప్పుడు ఆ కుటుంబం పడే బాధ వర్ణనాతీతం..
- రైతుకు భూమి హక్కు ఉంటేనే ఆర్థిక భరోసా.. భూమికి చట్టబద్ధమైన హక్కు ఉంటేనే రైతుకు సంపూర్ణ ధైర్యం, ఆర్థిక భద్రత లభిస్తుంది.





## మారిషస్‌లో తెలుగు వెలుగులకు తెలంగాణ తోడ్పాటు

- తెలుగు భాష, సంస్కృతి పరిరక్షణకు అన్ని విధాలా సహకారం
- తెలంగాణ--మారిషస్ మధ్య సాంస్కృతిక బంధాన్ని మరింత బలోపేతం చేస్తాం
- మారిషస్ ప్రతినిధి బృందానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హామీ

మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో మారిషస్ పబ్లిక్ సర్వీస్, అడ్మినిస్ట్రేటివ్ సర్వీసుల మంత్రి లచ్మనా రాజ్ పెంటియా నేతృత్వంలోని ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిశారు. మారిషస్‌లో తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాలు, పురాణ ఇతిహాసాల పరిరక్షణ, ప్రచారానికి తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు



## గంజాయి సేవిస్తున్న ఐదుగురు వ్యక్తులు పట్టివేత.

**తొలి సమయం, ఇల్లందు;ఆగస్టు, 29:**
ఇల్లందు, గంజాయి సేవనాన్ని అరికట్టేందుకు పోలీసులు చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో గంజాయి సేవిస్తున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, ఇల్లందు డీఎస్పీ యూ. వెంకన్న బాబు పర్యవేక్షణలో ఇల్లందు పరిసర ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. అదుపులోకి తీసుకున్న వారికి నిబంధనల ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించగా, గంజాయి సేవించినట్లు నిర్ధారణ అయిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే అనారోగ్య, సామాజిక దుష్పరిణామాలపై అవగాహన కల్పించి, పునరావాసం కోసం డీ-అడిక్షన్ సెంటర్‌కు తరలించే చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గంజాయి విక్రయాలు, అక్రమ రవాణా, సేవనానికి పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాదకద్రవ్యాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. ఈ తనిఖీల్లో ఇల్లందు ఎస్ఐ ఉమ, హెచ్‌సీ లాల్‌సింగ్, రవికుమార్, సలీం తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## మెగా ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి.




**తొలి సమయం, ఇల్లందు;ఆగస్టు, 29:**
సభ్యులందరూ మెగా ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. ఆరోగ్య పరీక్షలు క్రమం తప్పకుండా చేయించుకోవడం ద్వారా వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి సకాలంలో చికిత్స పొందవచ్చని తెలిపారు. ఈ శిబిరంలో జనరల్ హెల్త్ చెకప్‌తో పాటు బీపీ, బ్లడ్ షుగర్, ఈసీజీ, కార్డియాలజీ, పల్మనాలజీ, ఆర్థోపెడిక్స్, న్యూరో, కంటి, దంత వైద్య నిపుణుల సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. సభ్యులందరూ ఈ అవకాశాన్ని తప్పక వినియోగించుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు.

## ప్రకృతి పరిరక్షణ మనందరి బాధ్యత.

**ఎమ్మెల్యే కోరం కనకయ్య.**





**తొలి సమయం, ఇల్లందు;ఆగస్టు, 29:**
ఇల్లందు, ప్రకృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. లకావత్ లయాన్సిక ప్రకృతి అన్న ప్రసన్న వేడుకలో భాగంగా ఉసిరికాయలపల్లి శ్రీ కోటమైసమ్మ తల్లి దేవస్థానం వద్ద చిన్నారితో కలిసి ఎమ్మెల్యే కోరం కనకయ్య మొక్క నాటి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మొక్కలు నాటడం వల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించవచ్చన్నారు. నేడు నాటే ప్రతి మొక్క రేపటి తరాలకు ప్రాణవాయువును అందించే అమూల్యమైన సంపదగా మారుతుందని పేర్కొన్నారు. అటవీ సంపదను కాపాడుకోవడంతో పాటు గ్రామాలు, పట్టణాలు, దేవాలయాల పరిసరాల్లో విస్తృతంగా మొక్కలు నాటాలని సూచించారు. మొక్కలు నాటడంతో కార్యక్రమం పూర్తికాదని, వాటికి క్రమం తప్పకుండా నీరు అందిస్తూ సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాలని కోరారు. పర్యావరణ పరిరక్షణపై చిన్నారుల్లో అవగాహన కల్పించడం ద్వారా భవిష్యత్ తరాల్లో ప్రకృతి పట్ల బాధ్యతాయుతమైన ఆలోచనలను పెంపొందించవచ్చని అన్నారు. ప్రకృతితో మమేకమై పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రతి కుటుంబం, ప్రతి గ్రామం, ప్రతి సంస్థ ముందుకు రావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. పర్యావరణాన్ని కాపాడటం ద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి బాటలు వేయవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా దేవస్థానానికి వచ్చిన భక్తులు, స్థానికులు మొక్కలు నాటి వాటిని సంరక్షించేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలు, నాయకులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమ్మ తల్లి ఆలయానికి మహా బిల్వం, రుద్రాక్ష మొక్కల వితరణ



**తొలిసమయం, పాల్వంచ, ఆగస్టు 29 :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని పెద్దమ్మ తల్లి ఆలయానికి వెలుగు జిల్లా స్టాఫర్ రాజేందర్ మహా బిల్వం, రుద్రాక్ష మొక్కలను శనివారం వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని కోరారు. ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన మొక్కలను పెంచేందుకు ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. "నాటుదాం.. పెంచుదాం.. పంచుదాం" అనే నినాదంతో పచ్చదనం పెంపొందించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో అశోక్, సిలివేరి కోటి, చందర్, సంజీవరెడ్డి, సుదర్శన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**హరిప్రియ నాయక్.**

**తొలి సమయం, ఇల్లందు;ఆగస్టు, 29:**
ఇల్లందు, కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బానోత్ హరిప్రియ నాయక్ ఆరోపించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు సెప్టెంబర్ 2 నుంచి నిర్వహించనున్న 'సమరభేరి' కార్యక్రమాల విజయవంతానికి ఇల్లందులోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరిప్రియ నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పోలిస్తే ప్రస్తుత పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించడంతో పాటు ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు బీఆర్ఎస్ శ్రేణులు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 2 నుంచి




చేపట్టనున్న సమరభేరి కార్యక్రమాలను పట్టణ, మండల స్థాయిలో విస్తృతంగా నిర్వహించి విజయవంతం చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో తెలంగాణ ఉద్యమ సీనియర్ నాయకులు సిలివేరి సత్యనారాయణ, జిల్లా నాయకులు, పీఏసీఎస్ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు, భూక్య దళ్‌సింగ్, లకావత్ దేవీలాల్ నాయక్, 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య, మాజీ ప్రధాన కార్యదర్శి పరుచూరి వెంకటేశ్వరరావు, మాజీ కో-ఆప్షన్ సభ్యులు మసూద్ రబ్బు, పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వనపర్తి జిల్లా కేంద్రంలో పలు వివాహా కార్యక్రమాలకు హాజరైన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**తొలి సమయం, వనపర్తి, ఆగస్ట్ 29**
ఈరోజు రేవల్లి గ్రామంలో దీ=ూ పార్టీ నాయకులు శ్రీ బోర్ల బీమయ్య గారి కుమార్తె కుమారి ప్రశాంతి వివాహ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ వివాహవేడుకకు వ్యవసాయ శాఖ మాజీ మంత్రివర్యులు శ్రీ సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతన వధువును ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈరోజు బుద్ధారం గ్రామానికి చెందిన దీ=ూ పార్టీ మాజీ అధ్యక్షులు లచ్చిగౌడ్ గారి సోదరుడు నాగరాజ్ గౌడ్ఢ రోజా గార్ల కుమార్తె





తులసి ప్రధాన వేడుకకు మాజీ మంత్రివర్యులు శ్రీ సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతన వధువును ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. గౌరవ మాజీ మంత్రి వెంట మండల నాయకులు మాజీ జడ్పీటీసీ బీమయ్య, శివరాం రెడ్డి, భాస్కర్ రెడ్డి, సురేష్, శ్రీనివాస్ రెడ్డి, రాంచంద్రయ్య, కురుమయ్య రెడ్డి, వెంకటేష్ గ్రామ సర్పంచ్ శేఖర్ గౌడ్, వెంకటస్వామి, విజయ్ గౌడ్, తిరుపతయ్య వెంకట సాగర్,త నాయకులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణను పకడ్బందీగా చేపట్టాలి

### చిల్లంచర్లలో ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని పరిశీలించిన ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి

**తొలి సమయం మహబూబాబాద్/మరిపెడ ఆగస్టు 29**
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. శనివారం మరిపెడ మండలం చిల్లంచర్ల గ్రామపంచాయతీలో నిర్వహించిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో నమోదైన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఓటర్ల పేర్లు, చిరునామాలు, ఇతర వివరాల్లో తప్పులు ఉంటే వాటిని గుర్తించి నిబంధనల ప్రకారం సరిచేయాలని సిబ్బందికి తెలిపారు. అలాగే అర్హత కలిగిన కొత్త ఓటర్లను గుర్తించి వారి పేర్లను జాబితాలో నమోదు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడంతో పాటు, ఓటర్ల జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. గ్రామంలోని ఓటర్లు తమ వివరాలను పరిశీలించుకుని, ఏవైనా తప్పులు ఉంటే సంబంధిత సిబ్బంది దృష్టికి తీసుకువచ్చి సవరణలు చేయించుకోవాలని కోరారు. ప్రజలకు ఎస్ ఐ ఆర్



ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సిరాజ్, ఉపసర్పంచ్ అనిల్, పంచాయతీ కార్యదర్శులు లక్ష్మణ్, వినోద్, గోపీచంద్, ఉత్తేజ్, జీపీవో మస్తాన్‌తో పాటు పలువురు ఓటర్లు పాల్గొన్నారు.

## సెప్టెంబరు 3,4 తేదీలలో సిపిఐ(ఎం) రాజకీయ శిక్షణ తరగతులు..

- **అబ్బాయిపాలెంలో కరపత్రం ఆవిష్కరణ**
- **మండల కార్యదర్శి గుండ గాని మధుసూదన్**

**తొలి సమయం మహబూబాబాద్/మరిపెడ ఆగస్టు 29**
మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం అబ్బాయిపాలెం గ్రామంలో సెప్టెంబరు3,4 తేదీలలో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) సిపిఐ(ఎం) రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు మండల కార్యదర్శి గుండగాని మధుసూదన్ తెలిపారు. శనివారం అబ్బాయిపాలెం గ్రామంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలల్లో ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన రెండు లక్షల ఉద్యోగాల భర్తీ ఎస్సీ ఎస్టీలకు అంబేద్కర్ అభయాసం పథకం అమలు కాలేదని మహిళలకు నెలకు 2500 రూపాయలు ఇస్తామని చెప్పారు కానీ దానిని నేటి వరకు అమలు చేయలేదన్నారు. అట్లాగే షాదీ ముబారక్ కళ్యాణ లక్ష్మి లాంటి పథకాలను రద్దు చేయాలని ఆలోచనలు ప్రభుత్వ ఉందన్నారు. తులం బంగారం ఇస్తామన్నారు అది ఇవ్వలేదు. వంటగ్యాసు ధరలు 500 నుండి 1050కి పెంచడంతో పేదలు మధ్యతరగతి ప్రజలకు భారంగా మారిందన్నారు నిరుద్యోగ భృతి



కల్పించి ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు ఉద్యోగ జాబ్ క్యాలెండర్ను విడుదల చేయలేదని ఆరోపించారు. అంశాల నీటిపై సిపిఐ (ఎం) నిరంతరంగా దశల వారీగా పోరాటాలు నిర్వహిస్తున్నామన్నారు. రానున్న కాలంలో ప్రజా పోరాటాలని ఉధృతం చేయడానికి రాజకీయ శిక్షణలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని సుమారు 120 మంది సభ్యులకు రెండు రోజులపాటు అబ్బాయి పాలెం లో ఆతిథ్యం కల్పించి వారిని చైతన్యం చేయడానికి రాజకీయ శిక్షణ తరగతులు ఉపయోగపడతాయి అన్నారు.ప్రజలు అధికారులు ప్రజాతంత్ర వాదులు మేధావులు ఆదరించి హార్దిక సహాయ సహకారాలు అందించి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఆర్గనైజర్ బాణాల రాజన్న, సిపిఐ ఎం వార్డు సభ్యురాలు నందిపాటి ఉప్పలమ్మ, వెంకన్న, మండల నాయకులు జిన్నా లచ్చయ్య, శాఖ కార్యదర్శి కొండ ఉప్పలయ్య, నాయకులు జినక సైదులు, ఎర్ర వెంకన్న, జామ్మూర్తి, కామిడ్ల వెంకన్న, ఉపేందర్, తదితరులు ఉన్నారు.

# రజకుల కాలనీ అభివృద్ధి చేస్తుంటే తప్పుడు ప్రచారమా?

- అభివృద్ధి కోసం పనిచేస్తుంటే టార్గెట్ చేస్తున్నారు
- కట్టుకున్న ఇళ్లకు నంబర్లు ఇప్పించేందుకు

**అవసరమైతే ఆమరణ దీక్ష: వీణ సెబాస్టియన్**

**తొలిసమయం, కొత్తగూడెం, ఆగస్టు 29 :**



రజకుల కాలనీలో ఇళ్లు నిర్మించుకున్న వారి సంక్షేమం, మౌలిక వసతుల కోసం తాను చేస్తున్న కృషిని కొందరు అడ్డుకుంటూ తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని వీణ సెబాస్టియన్ ఆరోపించారు. కాలనీలో సమస్యల పరిష్కారానికి రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల సహకారంతో పలు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కాలనీలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు కోసం రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేశానని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా సహకారంతో స్థానిక సర్పంచ్ ద్వారా మంచినీటి పంపుల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రజకుల ఇళ్ల స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి ఇంటి నంబర్లు ఇప్పించేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో కొందరు ఉద్దేశ పూర్వకంగా తనను లక్ష్యంగా చేసుకుని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. కాలనీలో జరుగుతున్న వాస్తవాలను తెలుసుకోకుండా చెప్పుడు మాటలు నమ్మి అవగాహనా లేని ప్రజాప్రతినిధులు అక్కడ ఇళ్లను నిర్మించుకున్న వారిని ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. రజకుల స్థలాల విషయంలో ఎవరికైనా అన్యాయం జరిగితే ఆధారాలతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని, ఇళ్లు నిర్మించుకున్న వారి హక్కుల పరిరక్షణ కోసం అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షకు కూడా సిద్ధమని వీణ సెబాస్టియన్ స్పష్టం చేశారు.

## కేసముద్రానికి పొంగులేటి,వేం రాక

- ముున్సిపాలిటీ భావన నిర్మానానికి భూమి పూజ
- నూతన సబ్ స్టేషన్ ప్రారంభం
- ఇనుగుర్తి రెవెన్యూ కార్యాలయానికి భూమి పూజ
- నారాయణపురం రైతులకు పట్టా పాస్ పుస్తకాల పంపిణీ



**తొలి సమయం; కేసముద్రం/ (మహబూబాబాద్), ఆగస్టు 29:**

ఈనెల 31న కేసముద్రం ఇనుగుర్తి మండలాలకు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి రానున్నారు. 6 కోట్లతో నిర్మించబోయే కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని, మున్సిపాలిటి భవన నిర్మాణ భూమి పూజ,1.4 కోట్ల 33/11 కే.వి నూతన సబ్ స్టేషన్ ప్రారంభోత్సవం ప్రారంభించనున్నారు. మరియు 2.25 కోట్ల వ్యయంతో నూతనంగా ఏర్పడిన ఇనుగుర్తి మండలానికి రెవెన్యూ కార్యాలయం భూమి పూజ, అలాగేకేసముద్రం మండల నారాయణపురం గ్రామ ప్రజల చిరకాల స్వప్నం "రైతు ల భూములకు పట్టపాస్ పుస్తకాల పంపీణి వంటి కార్యక్రమాలలో పాల్గొననున్నారు. స్థానిక శాసనసభ్యులు డాక్టర్ మురళి నాయక్, మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు బలరాం నాయక్ హాజరయ్య ఈ కార్యక్రమాలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. కాగా స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో జరిగే ఈ కార్యక్రమానికి సభా ప్రాంగణ ఏర్పాట్లను అధికారులు డి.ఎస్.పి తిరుపతి రావు, ఆర్ అండ్ బి డి ఈ శ్రీకాంత్ ,కేసముద్రం సీఐ సత్యనారాయణ , ఎస్సై క్రాంతికుమార్, మరియు కేసముద్రం వ్యవ సాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్టిఏ సభ్యులు రావుల మురళీ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్,మాజీ మండల అధ్యక్షులు అల్లం నాగేశ్వర్ రావు,కూరెల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



**తొలి సమయం: కేసముద్రం/ (మహబూబాబాద్), ఆగస్టు 29;**

ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కేసముద్రంలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.కళాశాల ప్రిన్సిపాల్ డా, డి. రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు చంద్ర ప్రకాష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.వైస్ ప్రిన్సిపాల్ సి. హెచ్. మైసయ్య, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమం లో తెలుగు భాషాభివృద్ధికి విశేష కృషి చేసిన గిడుగు వెంకట రామమూర్తి సేవలను స్మరించుకుంటూ, తెలుగు భాష ప్రాధాన్యం, మాతృభాష పరిరక్షణ ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ముఖ్య అతిథి చంద్ర ప్రకాష్ మాట్లాడుతూ.. తెలుగు భాష గొప్ప సాహిత్య సంపదను కలిగి ఉందని, విద్యార్థులు మాతృభాషపై గౌరవం, అభిమానం పెంపొందించుకోవాలని సూచించారు. తెలుగు విభాగాధిపతి సోమ ప్రవీణ్ మాట్లాడుతూ, తెలుగు భాష మన సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతిబింబమని, ఆధునిక కాలంలోనూ తెలుగును సజీవంగా కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.వైస్ ప్రిన్సిపాల్ సి. హెచ్. మైసయ్య మాట్లాడుతూ, విద్యార్థులు తమ దైనందిన జీవితంలో తెలుగును విస్తృతంగా ఉపయోగించాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా విద్యార్థులు కవితలు, వ్యాసాలు, ప్రసంగాలు తదితర కార్యక్రమాల్లో పాల్గొని తెలుగు భాషా వైభవాన్ని చాటారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు గడిదెల రాజు, డా. జి. రమేష్ బాబు, ఎస్. రవి, బి.మంజుల, షేక్ సలీం, జి.ప్రసాద్, డా. డి. శంకర్, అధ్యాపకేతర సిబ్బంది,విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు గ్రామసభ ఆమోదం

**నేతావత్‌తండా గ్రామపంచాయతీలో పలు కీలక తీర్మానాలు**

**తొలి సమయం మహబూబాబాద్/మరిపెడ ఆగస్టు 29**



గ్రామాభివృద్ధికి అవసరమైన పలు పనులకు నేతావత తండా గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించిన గ్రామసభలో ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. గ్రామపంచాయతీ సర్పంచ్ భానోత్ కొండయ్య అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో గ్రామంలోని పలు సమస్యలు, అభివృద్ధి పనులపై చర్చించి తీర్మానాలు చేశారు. నేతావత్‌తండాలోని అంగన్‌వాడీ కేంద్రానికి నూతన భవనాన్ని నిర్మించేందుకు గ్రామసభలో తీర్మానం చేశారు. అదేవిధంగా పంటకుంటలు, ఊటకుంటలు, ఇంకుడు గుంతల నిర్మాణంతో పాటు ప్రతి ఇంటికి ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకునేలా ప్రజలను ప్రోత్సహించాలని నిర్ణయించారు. భూగర్భ జలాలను పెంపొందించేందుకు నీటి సంరక్షణ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలని గ్రామ సభలో నిర్ణయించారు. గ్రామంలోని నల్లల బావికి స్టీరింగ్ ఏర్పాటు, బోసికుంట వద్ద పంటకుంట, ఇంకుడు గుంతల ఏర్పాటుకు సంబంధించిన పనులకు కూడా గ్రామసభ ఆమోదం తెలిపింది. హరితహారం, వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి మూడు మొక్కల చొప్పున పంపిణీ చేసి, వాటి సంరక్షణ బాధ్యతను సంబంధిత వ్యక్తులకు అప్పగించాలని నిర్ణయించారు. మొక్కలను నాటడంతో పాటు అవి పెరిగే వరకు సంరక్షించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఇందులో భాగంగా రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అలాగే పరకాలజాల తండా నుంచి బోసికుంట వరకు, అక్కడి నుంచి బతుకమ్మ ఘాట్, రేఖ్యతండా గ్రామపంచాయతీ, బుర్కితండా గ్రామపంచాయతీ, చిల్లంచర్ల గ్రామపంచాయతీ, రాంపురం గ్రామపంచాయతీ, నీలుకుర్తి గ్రామపంచాయతీలను కలుపుతూ రహదారి నిర్మాణం, అనుసంధానం కోసం గ్రామసభలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. సుమారు రెండు కిలోమీటర్ల మేర రహదారికి ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాన్ని కూడా చేపట్టాలని నిర్ణయించారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే పలు గ్రామపంచాయతీల మధ్య రాకపోకలు మరింత సులభతరం అవుతాయని గ్రామస్థులు పేర్కొన్నారు. గ్రామానికి అవసరమైన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసి త్వరితగతిన చేపట్టాలని సంబంధిత అధికారులను గ్రామసభ ద్వారా కోరారు. గ్రామ ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని తీర్మానించారు. ఈ గ్రామసభలో సర్పంచ్ భానోత్ కొండయ్య, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, గ్రామ ప్రజలు, అంగన్‌వాడీ టీచర్లు బాను, కవిత, మోతీలాల్, ఈవో అధ్యక్షురాలు బాంత శ్రీదేవి, పరమేష్, యువజన నాయకులు గౌడ్స్ వెంకన్న, హుస్సేన్, బిచ్చా తదితరులు పాల్గొన్నారు. గ్రామసభలో చర్చించిన అంశాలకు సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.

# ప్రమాదాలకు నిలయంగా సుదిమల్ల పెట్రోల్ బంక్ ప్రాంతం

**ఇప్పటికే రెండు ప్రాణాలు బలి.. తండ్రి, కొడుకులు కాళ్లు కోల్పోయిన విషాదం.**

**తొలి సమయం, ఇల్లందు;ఆగస్టు, 29:**



వాహనాల అక్రమ పార్కింగ్‌పై చర్యలు తీసుకోవాలని నాలుగు గ్రామాల ప్రజల విజ్ఞప్తి. సుదిమల్ల గ్రామ పంచాయతీ పరిధిలోని పెట్రోల్ బంక్ ఎదుటి ప్రాంతం ప్రమాదాలకు నిలయంగా మారిందని స్థానిక గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది ఇదే ప్రాంతంలో జరిగిన ప్రమాదాల్లో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా, అదే కుటుంబానికి చెందిన తండ్రి, కొడుకులు తీవ్ర ప్రమాదానికి గురై కాళ్లు కోల్పోయి, కుటుంబానికి ఆసరా లేక దుర్భర పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంతటి విషాద ఘటనలు జరిగినప్పటికీ ప్రమాదాల నివారణకు శాశ్వత చర్యలు తీసుకోవడంలో సంబంధిత అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రమాదాల నేపథ్యంలో పోలీసులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినప్పటికీ, ఆ ప్రాంతంలో రహదారిపై వాహనాలను అడ్డంగా నిలిపివేయడం మాత్రం కొనసాగుతూనే ఉందని స్థానికులు చెబుతున్నారు. పెట్రోల్ బంక్ నిర్వాహకులు, యజమానులను రహదారిపై వాహనాలను నిలుపకుండా చూడాలని కోరుతున్నప్పటికీ, "వాహనాలు ఎక్కడ నిలుపుకోవాలి?" అంటూ సమాధానం ఇస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. దీంతో పోలీసుల నియంత్రణ లోపమా, లేక పెట్రోల్ బంక్ యజమానుల నిర్లక్ష్యమా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రహదారిపై అడ్డంగా నిలిపే వాహనాల కారణంగా రాకపోకలకు తీవ్ర అంతరాయం కలగడంతో పాటు, వాహనదారులు ప్రమాదాల బారిన పడే పరిస్థితి నెలకొంటోందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇప్పటికే ప్రాణనష్టం, శాశ్వత అంగవైకల్యంతో కుటుంబాలు తీవ్రంగా నష్టపోయిన నేపథ్యంలో మరో ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించాలని కోరుతున్నారు. సుదిమల్ల పరిసర ప్రాంతంలోని నాలుగు గ్రామాల ప్రజలు పోలీసు అధికారులను కలిసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వేడుకుంటున్నారు. ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కాకుండా, ప్రమాదాలకు కారణమవుతున్న పరిస్థితులను ముందుగానే గుర్తించి కట్టడి చేయాలని వారు కోరుతున్నారు. పెట్రోల్ బంక్ ఎదుట రహదారిపై వాహనాల నిలుపుదలను పూర్తిగా నియంత్రించడం, అవసరమైన చోట పార్కింగ్‌కు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం, హెచ్చరిక బోర్డులతో పాటు నిరంతర పోలీసు పర్యవేక్షణ చేపట్టాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకుని మరో కుటుంబం రోడ్డుప్రమాదంలో నష్టపోకుండా చూడాలని నాలుగు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

# పట్టుబట్టి...పట్టాలిస్తున్న.. ప్రజా ప్రభుత్వం

- హక్కుదారు కాబోయే నారాయణపురం రైతాంగం...ఇక సంబురంగా ఎవుసం...
- ఎన్నో ఏళ్ల కర్షకుల చిరకాల స్వప్నం... పరిష్కారాన్ని చూపిన యంత్రాంగం.

**తొలి సమయం; కేసముద్రం/ (మహబూబాబాద్), ఆగస్టు 29:**




గత ప్రభుత్వంలో భూ రికార్డుల ప్రక్షాళన పేరుతో అటవీ భూములు అంటూ పేర్కొనడంతో సాగులో ఉన్న రైతాంగానికి తీవ్ర నష్టం జరిగింది.గత ధరణిలో రైతు, తండ్రి అనే చోట అడవి అని చేర్చడంతో రైతులకు బ్యాంకుల నుండి, ప్రభుత్వం నుండి, అందవలసిన వ్యవసాయ రుణాలు,రైతుబంధు,రైతు బీమా,ఇతర పంట రుణాలు,వ్యవసాయ పనిముట్లు వంటి అనేక పథకాలకు అర్హులు కాకుండా నష్టపోయారు.వివరాల్లోకి వెళితే మహబూ బాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం రైతులు 2017లో భూ రికార్డులలో అడవి అని చేర్చడం వల్ల తీవ్రంగా నష్టపోయారు.అది గుర్తించిన నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు వచ్చిన రైతులకు పట్టాలు ఇచ్చి భూమిపై హక్కు కల్పించాలని పట్టుబట్టింది.2023లో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో ఇచ్చిన హామీకి అనుగుణంగా ధరణిని ప్రక్షాళన చేపట్టింది.అందులో భాగంగా నారాయణపురం గ్రామ రైతుల సమస్యను ఒక ప్రత్యేక సమస్యగా గుర్తించి రెవెన్యూ యంత్రాంగం అనేక రోజులు శ్రమించి చివరకు పట్టాలు ఇవ్వడానికి పూనుకుంది.

**నాయకుల ప్రత్యేక చొరవ**

నారాయణపురం గ్రామ రైతుల భూ సమస్య 2017 నుండి వస్తూ ఉంది. ఇట్టి భూములకు పట్టాలు ఇవ్వాలంటూ రైతులు అనేక సందర్భాలలో ధర్నాలు రాస్తారోకోలు చేయడం జరిగింది.ఇట్టి సమస్యను గుర్తించిన ఈ ప్రాంత వాసి వేం నరేందర్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులకు పట్టాలు ఇచ్చే కార్యక్రమం చేపట్టాలని సంబంధిత శాఖ మంత్రులకు,అధికారుల దృష్టికి సమస్య తీవ్రతను తీసుకువెళ్లడం జరిగింది. స్థానిక ఎమ్మెల్యే మురళి నాయక్ అసెంబ్లీ సమావేశంలో ప్రభుత్వం ఇట్టి సమస్యను వెంటనే పరిష్కార మార్గం చేపట్టాలని నొక్కి చెప్పారు. అంతేకాకుండా స్థానికంగా ఉండే నాయకులు, రైతులు నిత్యం అధికారుల దృష్టికి ఈ భూ సమస్యను తీసుకువెళ్లను సందర్భాలు అనేకం ఉన్నాయి.

**పొంగులేటి,వేం చేతుల మీదుగా రైతులకు పట్టాలు**

ఇచ్చిన మాట ప్రకారం నారాయణపురం రైతులకు భూమి పట్టాలు చే కార్యక్రమం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా ఈనెల 31న 780 మంది రైతులకు పాస్ పుస్తకాలు అందనున్నాయి.ఎన్నో ఏళ్ల భూ సమస్యకు నేటి ప్రజా ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడి పట్టుబట్టి పట్టాలు ఇస్తుందంటూ నారాయణపురం రైతులు వర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

# కాగితాలపై అధికారాలు వారివి.. అడవిలో జీవన పోరాటం మాది

**ఆదివాసుల సమస్యలపై ఉద్యమిస్తున్న వారికి అండగా నిలవాలని పిలుపు.**

**తొలిసమయం, ఇల్లందు;ఆగస్టు, 29:**




ఇల్లందు, ఐ.ఏ.ఎస్ ; ఐ.పి.ఎస్. అధికారుల చేతుల్లో అధికారాలు ఉంటే.. ఆదివాసుల చేతుల్లో బాణాలు ఉన్నాయి. కాగితాలపై వాళ్ల అధికారాలు.. అడవిలో మన అధికారాలు.. ఇంతే ఆదివాసుల బతుకులు" అంటూ ఆదివాసుల హక్కులు, సమస్యలపై పోరాడుతున్న నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసులు తమ హక్కుల కోసం ప్రశ్నిస్తే వారిని విప్లవకారులుగా ముద్ర వేస్తున్నారని, ధైర్యంగా ముందుకు అడుగు వేస్తే రాజకీయ స్వార్థం అంటున్నారని వారు విమర్శించారు. ఆదివాసులు వివక్షకు గురవుతున్నారని, వారి సమస్యలకు పరిష్కారం చూపాలని కోరుతూ నిరాహార దీక్షలు, ధర్నాలు చేపడుతున్నప్పటికీ తమను ఆదరించాల్సిన వారు కనీసం పోలీస్ స్టేషన్‌కు వచ్చి పరామర్శించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు గడిచినా ఆదివాసుల జీవన పరిస్థితుల్లో ఆశించిన మార్పు రాలేదని పేర్కొన్నారు. తరతరాలుగా అడవులను, ప్రకృతిని కాపాడుతూ జీవిస్తున్న ఆదివాసులు తమ హక్కుల కోసం ఇప్పటికీ ఉద్యమించాల్సిన పరిస్థితి రావడం బాధాకరమన్నారు. ఉద్యమ జెండాను భుజాన వేసుకుని ముందుకు నడుస్తున్న వారితో కొంత దూరమైనా కలిసి నడిచి, వారి పోరాటానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఆదివాసుల హక్కులు, ఆత్మగౌరవం, జీవన భద్రత కోసం జరుగుతున్న ఉద్యమాలను విమర్శించకుండా సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఆదివాసుల సమస్యలపై ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి చర్చల ద్వారా పరిష్కారం చూపాలని, వారి న్యాయమైన డిమాండ్లను పరిగణనలోకి తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో లాయర్ సత్యనారాయణ,జబ్బా .మూర్తి,తదితరులు పాల్గొన్నారు.




# రేస్-4 ప్రాజెక్టుకు అమీర్ గ్రీన్ సిగ్నల్



బాలీవుడ్ స్టార్ హీరో ఆమిర్ ఖాన్ చాలా రోజుల తర్వాత కొత్త ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ప్రముఖ యాక్షన్ ఫ్రాంచైజీ 'రేస్' నాలుగో భాగంలో ఆయన నటించనున్నట్లు బాలీవుడ్ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. 'రేస్ 4' స్క్రిప్ట్ ఆమిర్ ఖాన్‌కు బాగా నచ్చడంతో ఆయన ఈ ప్రాజెక్ట్‌ను చేయడానికి నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా, ఈ చిత్రానికి దర్శకత్వం వహించే బాధ్యతలను ప్రముఖ దర్శకుడు విజయ్ కృష్ణ ఆచార్యకు అప్పగించినట్లు సమాచారం. గతంలో ఆమిర్ ఖాన్, విజయ్ కృష్ణ ఆచర్య కాంబినేషన్‌లో వచ్చిన 'ధూమ్ 3' సినిమా భారీ విజయం సాధించిన విషయం తెలిసిందే. దీంతో ఈ ప్రాజెక్ట్‌ను విజయ్‌కి ఇవ్వబోతున్నట్లు సమాచారం. కాగా.. త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

# దూసుకుపోతున్న ఇరుముడి

## గ్రామీణ ప్రాంతాల్లో భారీగా టికెట్ల అమ్మకం




మాస్ మహారాజా రవితేజ నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఇరుముడి' బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతూ మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకుంది. విడుదలైనప్పటి నుంచి వం-సగా రికార్డులు సృష్టిస్తున్న ఈ చిత్రం తాజాగా ఆన్‌లైన్ టికెట్ విక్రయాల్లో సరికొత్త మైలురాయిని చేరుకుంది. ప్రముఖ టికెటింగ్ ఎ÷-లాట్‌ఫార్మ్‌లైన బుక్‌మైషో, డిస్ట్రిక్ట్ యాప్స్ ద్వారానే 'ఇరుముడి'కి 55 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడయ్యాయి. ఒక ప్రాంతీయ చిత్రానికి ఈ స్థాయిలో టికెట్ సేల్స్ నమోదు కావడం ట్రేడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. రవితేజ మాస్ అప్పీల్, ఎమోషనల్ డ్రామా, యాక్షన్ ఎపిసోడ్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటుండటంతో థియేటర్లలో ప్రేక్షకుల రద్దీ కొనసాగుతోంది. ఫ్యామిలీ ఆడియన్స్ నుంచి మాస్ ప్రేక్షకుల వరకు అన్ని వర్గాల నుంచి మంచి ఆదరణ లభిస్తుండటంతో సినిమా కలెక్షన్ల పరంగా కూడా దూసుకుపోతోంది. బాక్సాఫీస్ వద్ద ఇప్పటికే బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన 'ఇరుముడి' ఇప్పుడు టికెట్ విక్రయాల్లోనూ తన సత్తా చాటుతూ కొత్త రికార్డులను లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం చిత్రానికి ఉన్న జోరు చూస్తుంటే రాబోయే రోజుల్లో మరిన్ని మైలురాళ్లు అందుకోవడం ఖాయమనే అభిప్రాయం ట్రేడ్ వర్గాల్లో వ్యక్తమవుతోంది.






# శూర్పణఖ ఓ భిన్నమైన వ్యక్తిత్వం ఉన్న మహిళ

## కథానాయిక రకుల్ ప్రీత్ సింగ్

రామాయణ స్క్రిప్ట్ తనకు శూర్పణఖలోని కొత్త కోణాలను అన్వేషించడంలో సహాయపడిందని కథానాయిక రకుల్ ప్రీత్ సింగ్ అన్నారు. ఇప్పుడామె నితేశ్ తివారీ దర్శకత్వంలో రూపొందుతున్న 'రామాయణ: పార్ట్ 1' చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో ఆమె రావణుడి సోదరి అయిన శూర్పణఖ పాత్రలో కనిపించనుంది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రకుల్ ఈ సినిమాలోని తన పాత్ర గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది. శూర్పణఖ జీవితంలోని ఇంతకుముందు తెలియని కొన్ని కోణాలు ఈ పాత్ర చేయటం ద్వారా తెలుసుకున్నాను. ఆమె గురించి నాకు తెలియని విషయాలు చాలా ఉన్నాయి. నేను ఈ స్క్రిప్ట్ చదివినప్పుడు, లక్ష్మణుడు ఆమె ముక్కును కోసిన సంఘటన కంటే ముందు, ఆ తర్వాత ఆమె జీవితం గురించి చాలా విషయాలు అందులో ఉన్నాయి. నేను ఈ పాత్ర చేయడం ద్వారా నాకు ఇవన్నీ ఆసక్తిగా అనిపించాయి. అందుకే నాకు ఈ పాత్ర చాలా బాగా నచ్చింది. శూర్పణఖ వ్యక్తిత్వంలోని విభిన్న కోణాలకు నేను ఆకర్షితురాలినయ్యాను. లంకలో ఆమెను అత్యంత అందమైన మహిళ అని అనేవారు. ఆమెకు అహం ఉండేది. చరిత్ర తరచుగా ఆమెను ఒక భయంకరమైన ప్రతినాయకురాలిగా మాత్రమే గుర్తుంచుకున్నప్పటికీ శూర్పణఖలోని సహజసిద్ధమైన సంక్లిష్టతే నేను ఈ పాత్రను పోషించేలా చేసిందంటూ చెప్పుకొచ్చింది.




# 18న వస్తోన్న అనుమాన పక్షి

డిజె టిల్లు'తో సెన్సేషనల్ డెబ్యూను అందుకున్న దర్శకుడు విమల్ కృష్ణ రెండో సినిమా 'అనుమాన పక్షి'. రాగ్ మయూర్ హీరోగా ఈ సినిమాను రాజీవ్ చిలక, రాజేశ్ జగ్తియాని, హీరాచంద్ దండ్ నిర్మించారు. తొలి చిత్రం తరహాలోనే ఈ సినిమానూ యునిక్ కామెడీ ఎంటర్ టైనర్ గా విమల్ కృష్ణ తెరకెక్కించారు. తమ 'అ-నుమాన పక్షి' చిత్రం సెప్టెంబర్ 18న థియేటర్లలోకి రానుందని చిత్ర నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల తేదీని తెలియజేస్తూ ఓ ఆసక్తికరమైన పోస్టర్‌ను విడుదల చేశారు. సినిమా విభిన్నమైన టోన్‌తో పాటు హీరో విచిత్రమైన ఆలోచనా విధానాన్ని ఈ పోస్టర్ ప్రజెంట్ చేస్తోంది. రాగ్ మయూర్ సంప్రదాయ దుస్తుల్లో చేతిలో రైఫిల్ పట్టుకుని కనిపిస్తున్నారు. ఆయన పక్కనే ఉన్న బ్లాక్‌బోర్డుపై 'డౌట్స్ అండర్ ఇన్వెస్టిగేషన్' అనే టైటిల్‌తో జీవితం, విధి, కర్మ, దేవుడి ఎ÷-లానింగ్స్ కు సంబంధించిన ఆసక్తికరమైన ప్రశ్నలను పొందుపరిచారు. 'ఒన్ బోయ్. బిలియన్ థాట్స్, జీరో చిల్' అనే ట్యాగ్‌లైన్ ఆయన పాత్రలోని ఆలోచనా విధానాన్ని మరింత ఆసక్తికరంగా తెలియజేస్తోంది.

# జివితో అనుబంధాన్ని గుర్తు చేసుకున్న చిరు




తన మిత్రుడు జీవీ నారాయణ రావు అంత్యక్రియలకు హాజరయిన చిరంజీవి ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించిన చిరంజీవి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. నారాయణ రావుతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. 1977 నుంచి మా ఇద్దరి మధ్య పరిచయం. ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో కలుసుకున్నాం. తను అప్పటికే సీనియర్ స్టూడెంట్. మేం ట్రైనింగ్‌లో ఉన్నప్పుడు తన అనుభవాలు పంచుకునేవాడు. చాలా క్లోజ్‌గా ఉండేవాళ్లం. తర్వాత ఇండస్ట్రీలో ఎవరికి వాళ్లం బిజీ అయ్యాం. నా సినిమాల్లోనూ ఆయన నటించారు. ఆ తర్వాత మా బాధ్యతల వల్ల ఇద్దరి మధ్య గ్యాప్ వచ్చింది. యాదృచ్ఛికం ఏంటంటే.. పది రోజుల క్రితం కూడా 'మంచుపల్లకి' చూశాను. అందులో ఆయన కీలకపాత్రలో నటించారు. ఆ సినిమా స్ఫూర్తితో కొత్త కంటెంట్‌తో, ఐదుగురు కొత్త వాళ్లతో ఒక స్టోరీ రాశానని జీవీ చెప్పారు. నన్ను చూడాలన్నారు. దాని గురించి మాట్లాడిన తర్వాత ఇద్దరం కలిసి ఓ ఫొటో దిగాం. బహుశా ఆయన చివరి ఆలోచనలు నాతో పంచుకున్నారేమో. చాలా మొండి మనిషి. ఏ విషయాన్నీ లెక్క చేయడు అని తన జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

# టాక్సిక్‌లో మహిళలను తప్పుగా చిత్రీకరణ

## తమిళనాడు మాజీ బిజెపి నేత అన్నామలై ఆగ్రహం

రాకింగ్ స్టార్ యశ్ హీరోగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కిన తాజా పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్'. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమాపై తమిళనాడుకు చెందిన మాజీ బీజేపీ నేత కే. అన్నామలై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ చిత్రంలో మహిళలను తప్పుగా చిత్రీకరించారని, ఇది యువతపై చెడు ప్రభావం చూపుతుందని ఆయన విమర్శించారు. కోయంబత్తూరులో జరిగిన ఓ బహిరంగ సభలో అన్నామలై మాట్లాడుతూ సినిమాల ప్రభావం సమాజంపై ఏ విధంగా ఉంటుందో ప్రస్తావించారు. 'నిన్న ఓ సినిమా గురించి విన్నాను. అది మొదటి రోజే రూ. 104 కోట్లు వసూలు చేసింది. మనం ఎప్పుడూ మంచి విషయాలు మాట్లాడాలని చూస్తాం, కానీ ఏకంగా సినిమా పేరునే 'టాక్సిక్' అని పెట్టుకున్నారు. ఈ చిత్రం మహిళలను తప్పుగా చూపిస్తూనే భారీగా డబ్బు సంపాదిస్తోంది' అని ఆయన మండిపడ్డారు. ఇలాంటి చిత్రాలను విద్యార్థులు, యువత చూస్తే దేశం ఏ దిశగా పయనిస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవైపు నగరాల్లో మహిళల భద్రత గురించి చర్చిస్తున్నామని, మరోవైపు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (అఃఈఅ) ఇలాంటి చిత్రాలకు ఎలా అనుమతి ఇస్తోందని ఆయన ప్రశ్నించారు. సినిమాలలో మహిళలను గౌరవించే విధానం ఉండాలని, సర్టిఫికేషన్ విషయంలో సెన్సార్ బోర్డ్ మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామాలో నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, హ్యూమా ఖురేషి తదితరులు కీలక పాత్రలు పోషించారు. బుధవారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను సాధించినప్పటికీ, దీనిలోని అభ్యంతరకర సన్నివేశాలు, హింస మరియు మహిళల చిత్రణపై ప్రస్తుతం సర్వత్ర చర్చ జరుగుతోంది.



PUBLICATIONS AND PRINTERING BY VEMULA AYODHYA RAMULU, H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST: MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506101, TELTEL NO 12283, PHONE NUMBER 9000689544...